వివాహాలకు వెళ్లినా.. పంట పొలాల్లో చూసినా.. ప్రస్తుతం డ్రోనే కనిపిస్తున్నాయి. సాంకేతికత పెరుగుతున్న నేపథ్యంలో అన్ని రంగాల్లో యాంత్రీకరణ పరుగులు పెడుతోంది. వ్యవసాయంలో ఇటీవల కొత్త కొత్త పరికరాలు అందుబాటులోకి వస్తున్నాయి. వాటిలో ముఖ్యమైనది డ్రోన్. విత్తనాలు చల్లడం, ఎరువులు పిచికారీ చేయడంలో రైతులకు శ్రమ తగ్గింది, ఆదాయానికి మార్గం వేసోంది. ప్రభుత్వం సైతం రాష్ట్రాన్ని డ్రోన్ ఇన్నోవేషన్ కేంద్రంగా మారుస్తామని చెప్పడంతో జిల్లా వ్యవసాయ అధికారులు ఆ దిశగా ఆసక్తి చూపుతున్నారు.

వ్యవసాయంలో డ్రోన్ యుగం

★ వినియోగంతో రైతులకు మేలు
★ ప్రోత్సహిస్తున్న అధికారులు



పార్వతీపురంలో డ్రోన్‌తో పిచికారీని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ (పాత చిత్రం)

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం: జిల్లాలోని 15 మండలాల పరిధిలో 451 పంచాయతీలు ఉన్నాయి. 3.40 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. లక్ష ఎకరాల్లో ఉద్యాన పంటలు పండిస్తున్నారు. జిల్లాలో చిన్న సన్నకారు రైతులే ఎక్కువ. పంటల సీజన్లలో కూలీల కొరత ఏర్పడుతోంది. వారి స్థానంలో డ్రోన్‌ను వినియోగించాలని వ్యవసాయ అధికారులు సైతం సూచిస్తున్నారు.

ధరలు.. రాయితీలు..

వ్యవసాయ రంగంలో వినియోగించే డ్రోన్ రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంటుంది. బ్యాటరీ విలువ రూ.40వేలు. రెండు, మూడు బ్యాటరీలు అందుబాటులో ఉంచాలి. పొలంలో విద్యుత్తు లేకపోతే జనరేటర్ ఉండాలి. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై), ఎస్‌ఎంఏఎం పథకాల ద్వారా డ్రోన్లపై 40 శాతం రాయితీ ఇస్తారు. 10 లీటర్ల సామర్థ్యం ఉన్న డ్రోన్ ఖరీదు రూ.10 లక్షలయితే కేంద్రం రూ.4 లక్షల రాయితీ, బ్యాంకు రూ.5 లక్షల రుణం ఇస్తాయి. 10 శాతం రైతు, స్వయం శక్తి సంఘాలు సమకూర్చాల్సి ఉంటుంది.

రోజుకు 100 ఎకరాల్లో పిచికారీ..

డ్రోన్ సామర్థ్యం బట్టి గరిష్ఠంగా 75 నుంచి 100 ఎకరాల్లో క్రిమి సంహారక మందు పిచికారీ చేయొచ్చు. ముఖ్య అదును నుంచి వైపరకు తప్పుతుంది. ఇద్దరు కూలీలను పెడితే రోజుకు రూ.500 నుంచి రూ.600 చెల్లించాలి. వారికి రూ.1,100 అవుతుంది. అదే డ్రోన్ నిర్వాహకులకు రూ.450 నుంచి రూ.550 చెల్లిస్తే చాలు. దీనికి తోడు ఎకరా భూమిలో 10 నిమిషాల్లో పిచికారీ చేయొచ్చు. స్ప్రేయర్‌తో పిచికారీ చేస్తే ఎకరాకు 200 లీటర్ల నీరు అవసరం. డ్రోన్‌తో అయితే కేవలం 10 లీటర్లు సరిపోతుందని అధికారులు చెబుతున్నారు.

గతంలో అడుగులు పడలే..

గతంలో వైకాపా ప్రభుత్వం వ్యవసాయ రంగంలో డ్రోన్లు అందుబాటులోకి తెస్తామని ప్రకటించింది. జిల్లాలో 10 మందికి శిక్షణ ఇచ్చింది. కానీ డ్రోన్లు సమకూర్చలేదు. సొంతంగా కొనుగోలు చేసి ఆదాయం పొందాలని సూచించడంతో ఎవరూ ముందుకు రాలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం డ్రోన్లకు అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.

ప్రభుత్వ సూచన మేరకు..

వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. ప్రైవేటు సిబ్బందితో ప్రయోగాలు చేశాం. రానున్న రోజుల్లో సేవలు విస్తరించే అవకాశాలున్నాయి. గతంలో పది మందికి శిక్షణ ఇచ్చాం. ప్రస్తుత ప్రభుత్వ సూచనలు, ఆదేశాలతో ముందుకు వెళ్తాం.

– రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయాధికారి

డీఈవోగా తిరుపతినాయుడు



పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖ అధికారిగా ఎన్.తిరుపతినాయుడు నియమితులయ్యారు. బదిలీల్లో భాగంగా విజయనగరం డైట్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా ఉన్న ఈయన జిల్లాకు వచ్చారు. ఇన్నాళ్లు మన్యంలో డీఈవోగా ఉన్న పగడాలమ్మను డైట్ కళాశాలకు బదిలీ చేశారు. ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే తాను బాధ్యతలు చేపడతామని డీఈవో తిరుపతినాయుడు 'న్యూస్‌టుడే'కు తెలియజేశారు.

నిధులు మింగేసి.. వ్యాధులు పోగేసి

● అయిదేళ్లూ ఇదే పరిస్థితి
● నేటికీ వెంటాడుతున్న సమస్యలు

గత ప్రభుత్వ పాపాలు పల్లె ప్రజలను నేటికీ వెంటాడుతున్నాయి.. సమస్యల రూపంలో శాపంలా చుట్టుముడుతున్నాయి.. అయిదేళ్లూ కనీస అభివృద్ధి పనులు చేపట్టలేదు.. ఆర్థిక నిధులను సైతం లాగేశారు.. ఈ క్రమంలో పారిశుద్ధ్య చర్యలు నిలిచిపోయాయి.. కాలువల్లో మురుగు పేరుకుపోయింది.. ఎక్కడికక్కడే వాడుక నీటి నిల్వలు దర్శనమిస్తున్నాయి.. ఫలితంగా నెల రోజుల వ్యవధిలోనే ఎస్.కోట, కొత్తవలస, పాచిపెంట, గుర్ల, దత్తిరాజేరు తదితర ప్రాంతాల్లో అతిసారం విజృంభించింది. కూటమి అధికారంలోకి వచ్చాక ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధులు రావడంతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.



– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, సాలూరు గ్రామీణం

విజయనగరం జిల్లాలో 777, మన్యంలో 451 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో అంతర్గత రహదారులు, కాలువలు తదితర పనులకు ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేయాల్సి ఉంది. గత ప్రభుత్వం పెద్దఎత్తున సొమ్మును దారి మళ్లించడంతో ప్రత్యామ్నాయం కరవైంది. పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు లేకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఈ నిధుల నుంచే రూ.29.27 కోట్లను విద్యుత్తు బకాయిలకు మినహాయించారు. ఎన్నికల ముందు 2023-24 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం ఇచ్చిన రెండో విడత నిధులను సైతం విడుదల చేయలేదు.



సాలూరు మండలం కరాసువలస పంచాయతీ దత్తివలసలోని రక్షిత మంచినీటి ట్యాంకుపై రాసి ఉన్న బోర్డు ఇది. ట్యాంకు శుభ్రం చేసిన తేదీ అన్న చోట ఎటువంటి వివరాలు లేవు.

తాగునీటి పరీక్షలేవీ..

ప్రజలకు అందించే తాగునీటికి పరీక్షలు, క్లోరినేషన్ వంటి చర్యలు లోపించాయి. రెండు జిల్లాల్లో పది ప్రయోగశాలలుండగా.. వాటి పరిధిలోని మండలాల్లో ఏడాదికోసారి కెమికల్, రెండు సార్లు బ్యాక్టీరియా పరీక్షలు నిర్వహించాలి. ఇవి కాకుండా అత్యవసర సమయాల్లో ప్రత్యేకంగా చేపట్టాలి. పంచాయతీల వద్దనున్న ఫీల్డ్‌టెస్ట్ కిట్లతో ఎప్పటికప్పుడు పరిశీలించాలి. రసాయనాలు లేకపోవడం, సిబ్బందికి నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడంతో అన్నీ నిలిచిపోయాయి.



సాలూరు మండలం మామిడిపల్లి ఎస్సీ కాలనీలోని మురికి కాలువలో వీధి కుళాయి పైపులు ఇలా ఉన్నాయి. గతంలో కూడా వీటిపై స్థానికులు ఫిర్యాదు చేశారు. అయినా పరిస్థితిలో మార్పు లేదు. ఇంటింట కుళాయిలు ఈ గ్రామంలో వేయలేదు.

ఆగిన పనులు

విజయనగరం జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా 4,10,065 కుటుంబాలకు 1,94,998 కనెక్షన్లు కేటాయించారు. ఇంకా 2,15,067 ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వాలి. కేంద్రం నిధులిచ్చినా వైకాపా పూర్తిస్థాయిలో ఖర్చు చేయకపోవడం, రాష్ట్ర వాటాగా తన వంతు ఇవ్వకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. కూటమి వచ్చాక.. పల్స్ సర్వే ఆధారంగా అవకాశాన్ని బట్టి జిల్లాలో బోర్లు, రిజర్వాయర్ల ద్వారా కుళాయి వేసేందుకు రూ.36.16 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు.

రూ.కోట్లలో బకాయిలు

రెండు జిల్లాల్లోని 33 సీపీడబ్ల్యూఎస్ పథకాల ద్వారా సుమారు పది లక్షల మందికి నీరందుతోంది. వీటి నిర్వహణకు ఆర్థిక సంఘం నిధులు కేటాయించారు. సగటున ఏటా రూ.40 కోట్లు ఖర్చవుతుంది. జడ్పీ ద్వారా రూ.16 కోట్లే ఇస్తుండడంతో.. గుత్తేదారులకు పెద్దఎత్తున బకాయిలు పేరుకుపోయాయి. గత ప్రభుత్వ హయాంలో రూ.168.83 కోట్ల వ్యయం కాగా.. జడ్పీకి 15వ ఆర్థిక సంఘం కింద 2020-21 నుంచి 2023-24 నాటికి రూ.52.20 కోట్లు వచ్చాయి. మిగిలిన రూ.116.63 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. కానీ ఇవ్వలేదు. కూటమి వచ్చాక రూ.8.11 కోట్లు అందించింది.

జీతం అడిగితే.. తొలగింపు

క్లాప్‌మిత్రలకు నెలకు రూ.6 వేలు చెల్లించేవారు. 3,500 మంది ఉండగా.. ఇప్పటికీ కొన్ని పంచాయతీల్లో ఏడాదిపైగా బకాయిలున్నాయి. 2022 మార్చి వరకు స్వచ్ఛాంధ్ర మిషన్ ద్వారా జీతం అందించేవారు. కేంద్రం నిలిపివేయడంతో అప్పటి నుంచి వారికి కష్టాలు మొదలయ్యాయి. జీతం అడిగితే విధుల నుంచి తొలగించేవారు. ప్రస్తుతం తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించామని విజయనగరం డీపీవో వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో రూ.100 కోట్ల మేర నిధులున్నాయని చెప్పారు.

అన్నీ నిరుపయోగం

గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన సంపద సృష్టి కేంద్రాలు మూలకు చేరాయి. 855 ఉండగా.. 70 వరకు పనిచేయలేదు. మిగిలిన వాటిల్లో అరకొరగానే ఎరువు తయారీ అవుతోంది. రెండు జిల్లాల్లో మరో 373 కేంద్రాలు నిర్మాణ దశలో ఉన్నాయి. ఉపాధి పథకం కింద నిధులివ్వాల్సి ఉన్నా.. వైకాపా పట్టించుకోలేదు.

పంచాయతీలు: 451 | రెవెన్యూ గ్రామాలు: 2282 | సీపీడబ్ల్యూఎస్: 11 | పీడీడబ్ల్యూఎస్: 794 | ఎంపీడబ్ల్యూఎస్: 71 | డైరెక్ట్ పంపింగ్: 1600 | బోరు బావులు: 7217 | సోలార్ పంపింగ్: 395

కళ్లెదుట కొత్త భవనం..

చదువులకు తప్పని కష్టం



ప్రారంభంకాని భవనం



గదిలో కిక్కిరిసి కూర్చున్న విద్యార్థినులు, పక్కనే పెట్టెలు

పాచిపెంట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. రూ.1.75 కోట్లతో కొత్త భవన నిర్మాణం పూర్తయి అందుబాటులో ఉన్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఈ పాఠశాలలో మూడు నుంచి పది వరకు 371 మంది చదువుతున్నారు. కానీ సరిపడా గదులు, మరుగుదొడ్లు, స్నానపుగదులు లేవు. దీంతో కొత్త భవనం నిర్మించారు. గతేడాది సంక్రాంతికే ప్రారంభిస్తారని భావించినా వివిధ కారణాలతో ఆగిపోయింది. తర్వాత ఎన్నికల కోడ్, వేసవి సెలవులు రావడంతో అడుగులు ముందుకు పడలేదు. పాఠశాలలు ప్రారంభమై నెలలు గడుస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో బాలికలకు అవస్థలు తప్పడం లేదు. దీనిపై ఐటీడీఏ డీఈ ఏ.మణిరాజు వద్ద ప్రస్తావించగా.. త్వరలో తేదీ ఖరారు చేసి భవనం ప్రారంభిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, పాచిపెంట



పరిసరాలు పరిశీలిస్తున్న డీఐజీ గోపీనాథ్ జట్టీ

మహిళల రక్షణపై అవగాహన అవసరం

బలిజిపేట, న్యూస్‌టుడే: మహిళలు మోసాలకు గురికాకుండా, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అవగాహన కల్పించాలని పోలీసు సిబ్బందికి విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ సూచించారు. బలిజిపేట ఠాణాను గురువారం సందర్శించారు. పోలీసు స్టేషన్‌కు చెందిన మైదానం ఆక్రమణకు గురైనట్లు ఉందని ఎస్సై సింహాచలంతో మాట్లాడారు. అనంతరం దస్త్రాలు పరిశీలించి స్థానికంగా నమోదవుతున్న కేసులు, వస్తున్న ఫిర్యాదులపై ఆరా తీశారు. ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డితో కలిసి ఆవరణలో మొక్కలు నాటారు. ఏఎస్పీ అంకిత సురాన, సీఐ గోవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వాగు నీరే గతి.. ఎన్నాళ్లీ దుస్థితి

సీతంపేట మన్యంలోని అనేక గిరి శిఖర, గిరిజన తండాలకు నేటికీ కొండ వాగు నీరే గతవుతోంది. అది తాగుతున్న గిరిజనులు వ్యాధుల బారినపడుతున్నారు. ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా జ్వరాలు, మలేరియాతో బాధపడుతున్నారు.

గిరి శిఖర గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు, బోర్లు, బావులు వంటివి లేకపోవడంతో కొండవాగుల నీటిని గ్రావిటేషన్‌ఫ్లో ద్వారా గ్రామాలకు రప్పించి అందిస్తున్నారు. వేసవిలో వాగులో తక్కువ నీరు ఉంటే ఎద్దడి నెలకొంటుంది. వర్షాకాలంలో పుష్కలంగా ఉన్నా బురదమయమై కలుషిత జలం వస్తుంది. ప్రధానంగా మర్రిపాడు పంచాయతీ ఎగువద్వారబంధం, నడిమి ద్వారబంధం, దిగువద్వారబంధంలో సుమారు 80 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ గ్రామాలకు ఎగువన నాలుగైదు కి.మీ. దూరంలోని కొండవాగు నుంచి పైపుల ద్వారా నీటిని అందిస్తున్నారు. అది ప్రస్తుతం కలుషితమై ఉంది. ఈ విషయమై గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ సత్యం వద్ద ప్రస్తావించగా ఆయా గ్రామాల్లో సమస్యలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

– న్యూస్‌టుడే, సీతంపేట



వాగు నీటిలో ఆకులు, వ్యర్థాలు పడడంతో కలుషితం అవుతున్న దృశ్యం



పైపుల ద్వారా వస్తున్న వాగునీటిని పట్టుకుంటున్న ద్వారబంధం మహిళలు

★ కొత్తవలస మండలం తుమ్మికాపల్లికి చెందిన వృద్ధుడు నాలుగు సార్లు దరఖాస్తు చేశారు. అయితే రోజువారీ కూలీ అయిన అతని పేరిట విజయనగరంలోని ఓ అపార్టుమెంటులో అయిదిళ్లకు విద్యుత్తు మీటర్లు ఉన్నాయని సచివాలయ సిబ్బంది.. తిరస్కరించారు. దీంతో నేటికీ ఎదురు చూస్తున్నారు.

★ విజయనగరం మండలానికి చెందిన ఓ వ్యక్తి వైద్యారోగ్య శాఖ పింఛనుకు ఎంపికయ్యారు. అయితే గత ప్రభుత్వ హయాంలో ఆరు దశల పరిశీలనలో భాగంగా భూమి ఎక్కువగా ఉందని చూపి.. తొలగించారు. వాస్తవానికి ఆయనకు సెంటు స్థలం కూడా లేదు. దీంతో రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగారు. ఇప్పటికీ రికార్డులు మారకపోవడంతో అనర్హుడయ్యారు.

★ నగరంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన మహిళ వితంతువు. అయితే ఆమెకు ప్రభుత్వ ఉద్యోగం ఉన్నట్లు నవశకం సర్వేలో తేలింది. సచివాలయానికి వెళ్లగా.. కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అప్పట్లో పలుమార్లు స్పందనను ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయింది.

పింఛను ఇక మరింత సులువు

● ఆరు దశల పరిశీలనకు స్వస్తి
● గ్రామసభలోనే తుది నిర్ణయం

– న్యూస్‌టుడే, విజయనగరం మయూరికూడలి

ఉమ్మడి జిల్లాలో చాలామంది వివిధ సమస్యలతో పింఛనుకు దూరమయ్యారు.. నవశకం పేరిట గత ప్రభుత్వం ఆరు దశల పరిశీలన చేపట్టి.. అర్హులను వడపోసింది.. ఈక్రమంలో నిజమైన లబ్ధిదారులు సైతం అనర్హులయ్యారు.. సరైన ధ్రువపత్రాల కోసం అయిదేళ్లూ కార్యాలయాల చుట్టూ తిరిగారు.. ఈ కష్టాలకు కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. నాటి విధానాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. గ్రామసభకే ఎంపిక ప్రక్రియను అప్పగించింది.



గత సర్వే ఇలా..

గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకు ఆరు దశల పరిశీలన ఉండేది. భూమి (మెట్ట పదెకరాలు, పల్లం మూడెకరాలు) ఎక్కువగా ఉన్నా, ఆదాయ పన్ను, జీఎస్టీ చెల్లిస్తున్న వారు, ప్రభుత్వ ఉద్యోగం ఉన్న వారు, ప్రభుత్వ పింఛనుదారులు, 300 యూనిట్లకు పైబడి విద్యుత్తు బిల్లు, పట్టణంలో 1000 చ.అ., గ్రామీణంలో 750 చ.అ.. ఇల్లు, నాలుగు చక్రాల వాహనం ఉన్నవారిని అనర్హులుగా ప్రకటించేవారు. ఈక్రమంలో చాలామంది వివరాలు తప్పుగా నమోదు కావడంతో ఇబ్బందులు పడేవారు. ఇలాంటి వారు ఉమ్మడి జిల్లాలో 4,000 మంది వరకు ఉన్నట్లు అప్పట్లో అధికారులు ప్రకటించారు. వారు క్లియరెన్స్ ధ్రువీకరణ పత్రంలో సచివాలయాలను సంప్రదిస్తే.. తదుపరి ప్రక్రియ సాగేది. అయితే కార్యాలయాల చుట్టూ తిరగలేక.. చాలామంది దూరం అయ్యారు.

50 రోజుల ప్రణాళిక

తాజాగా కూటమి నిర్ణయంతో పాత వారితో పాటు కొత్తగా అర్హులైన వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ఇప్పటికే ప్రక్రియను ప్రారంభించింది. నవంబరు నుంచి అధికారికంగా తీసుకోనున్నారు. డిసెంబరులోపు పూర్తి చేసి, జనవరి నుంచి నగదు ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించింది. గ్రామసభలో నిర్ణయం తర్వాత తుది జాబితాలను ప్రకటిస్తామని, స్థానికంగానే ఎంపికలు ఉంటాయని డీఆర్డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి తెలిపారు.

పారిశ్రామిక పార్కుకు స్థల సేకరణ

పార్వతీపురం, పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు అవసరమైన స్థలం సేకరించాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమయ్యారు. పాచిపెంట జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ప్రాంతాలను గుర్తిస్తే భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వే గ్రామసభల దస్త్రాలు పక్కాగా ఉండాలని సూచించారు. జేసీ శోభిక, సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఇన్‌ఛార్జి డీఆర్వో కేశవనాయుడు, తహసీల్దారు, సర్వేయర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్

వంటింట దీపావళి ధమాకా




పంపిణీ ఇలా

సమయం	సిలిండర్లు
ఏప్రిల్- జులై	01
ఆగస్టు- నవంబరు	01
డిసెంబరు- మార్చి	01

న్యూస్‌టుడే–రాజాం

కూటమి ప్రభుత్వం దీపావళి ధమాకా ప్రకటించింది. సూపర్-6లో మరో కీలక పథకానికి పచ్చజెండా ఊపింది. మహిళలు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్న మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లకు మంత్రి మండలి బుధవారం ఆమోద ముద్ర వేసింది. దీపావళి రోజున చంద్రబాబు పథకాన్ని ప్రారంభిస్తారు. ఆ రోజు నుంచే సిలిండర్ల పంపిణీ చేయాలని నిర్ణయించారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి దీన్ని వర్తింపజేస్తామని పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు.

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఈ పథకం ద్వారా ఎంత మందికి లబ్ధి కలుగుతుందనే దానిపై ఇంకా స్పష్టత లేకపోయినా.. తెల్ల రేషన్‌కార్డు ఉన్న వారికి వర్తించే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. రెండు చోట్లా 8,62,939 తెల్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. ఈ లెక్కన ఏడాదికి 25,88,817 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం బండ ధర రూ.827.51 (దూరం బట్టి మారుతుంది)గా ఉంది. కేంద్ర ప్రభుత్వం రూ.10.62 రాయితీ ఇస్తోంది. అంతిమంగా జనం రూ.816.89 వెచ్చిస్తున్నారు. ఈ లెక్కన ప్రభుత్వం రూ.211.47 కోట్ల మేర భారం మోయాల్సి ఉంటుంది.



బ్యాంకు వ్యక్తిగత ఖాతాకు నగదు జమ

లబ్ధిదారులు ఇప్పటి మాదిరిగానే గ్యాస్ సిలిండర్లను నగదు చెల్లించి బుకింగ్ చేసుకోవాలి. సిలిండర్ ఇంటికి డెలివరీ అయిన 48 గంటల్లో ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) విధానంలో వ్యక్తిగత ఖాతాకు నగదు జమ చేస్తారు. ప్రతి నాలుగు నెలల్లో ఒక సిలిండర్‌ను ఎప్పుడు అయినా ఉచితంగా పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. బుకింగ్, డెలివరీ, నగదు జమల్లో సాంకేతిక సమస్యలు తలెత్తితే గ్రామస్థాయిలో సచివాలయాల్లోనే పరిష్కరిస్తారు. ఇందుకు ప్రతి సచివాలయం నుంచి ఒక ఉద్యోగికి బాధ్యతలు అప్పగించనున్నారు.

పారదర్శకంగా అమలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తాం. విధి విధానాలు ఇంకా వెల్లడి కాలేదు. దీపావళి నుంచి అర్హులైన వారందరికీ పథకాన్ని వర్తింపజేస్తాం.

– మధుసూదనరావు, డీఎస్‌వో

నేటినుంచి అఖిల భారత పశు గణన

విజయనగరం వ్యవసాయ విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ అధికారి వై.వి.రమణ తెలిపారు. నిర్వహణ కోసం 68 మంది పర్యవేక్షకులను నియమించామన్నారు. ఇప్పటికే వారికి శిక్షణ ఇచ్చామని చెప్పారు. వీరంతా క్షేత్రస్థాయిలోకి వెళ్లి, వివరాలు సేకరిస్తారని, పాడిరైతులు సహకరించాలని కోరారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు ప్రక్రియ సాగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పశువుల సంఖ్య తెలుస్తుందని, తద్వారా పథకాల అమలు సులువవుతుందని చెప్పారు.

వరి దక్కేనా.. జొన్న కదిలేనా


మరడాం గ్రామంలో నీరు లేక ఎండిన వరి పైరు

గడిచిన 15 రోజులుగా వర్షాలు లేకపోవడం, ప్రస్తుతం వరి పంట చిరుపొట్ట, పిగులుపొట్ట, గింజకట్టే దశల్లో ఉన్నందున నీరు అందక దిగుబడులు తగ్గే పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ, సాలూరు, మెంటాడ, దత్తిరాజేరు, సంతకవిటి, వంగర తదితర మండలాల పరిధిలో 30 వేల హెక్టార్లలో సాగవుతోంది. అందులో మెట్ట భూముల్లో ఉన్న 8 వేల హెక్టార్ల మేర ప్రస్తుతం నీటి ఎద్దడిని ఎదుర్కొంటోంది. మరడాం, పాచలవలస, కొత్తవలస, చినకాద, కుంటినవలస, పెదమేడపల్లి, మీసాలపేట, బంగారమ్మపేట, భూదేవిపేట, మరుపల్లి, జిన్నాం, దేవుపల్లి, కెరటాం, అగ్రహారం, బుడతనాపల్లి తదితర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. గజపతినగరంలో అక్టోబరు నెలలో సాధారణ వర్షపాతం 158.7 మి.మీ కాగా ఇప్పటి వరకు 57.4 మి.మీ నమోదైంది. దీంతో కొందరు అన్నదాతలు ఆయిల్ ఇంజిన్లు పెట్టి నీటిని తోడుతున్నారు. దీనిపై ఏడీఏ మహరాజన్ వద్ద ప్రస్తావించగా ఈ సమయంలో వర్షాలు కురిస్తే కంకులు పెరుగుతాయని చెప్పారు. అవసరం మేరకు 5 శాతం యూరియా ద్రావణాన్ని పిచికారీ చేసి పంటను కాపాడుకోవాలని సూచించారు.

– న్యూస్‌టుడే, గజపతినగరం


బంగారమ్మపేటలో ఆయిల్ ఇంజినుతో నీరు తోడుతున్న రైతు



వాయుగుండం ప్రభావంతో మొక్కజొన్న రైతులు ఆందోళనలు వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట వర్షాలతో తడిచి నష్టపోతుందేమోనని కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. పాచిపెంట మండలంలో 6 వేల ఎకరాల్లో జొన్న సాగైంది. దాదాపు 4 వేల ఎకరాల్లో పంట చేతికొచ్చింది. పొలాల్లో గింజ ఆరబెడుతున్న సమయంలో కురుస్తున్న వర్షాలతో పంట దెబ్బతినే ప్రమాదముందని వాపోతున్నారు. దీనికితోడు సీజన్ ప్రారంభంలో వ్యాపారులు క్వింటా రూ.2,400కు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం భారీగా ధర తగ్గించారని, ప్రభుత్వం సైతం కొనుగోలు కేంద్రాలు పెట్టలేదని పలువురు చెబుతున్నారు. ఈక్రమంలో బస్తాలలో నిల్వ చేస్తున్నామని పేర్కొంటున్నారు.

– న్యూస్‌టుడే, పాచిపెంట


పాచిపెంటలో రోడ్డుపైనే గింజల ఆరబోత

6 లక్షల చేప పిల్లల విడుదల

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: మత్స్యకారులు చేప పిల్లలను పెంచుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. గురువారం తోటపల్లి జలాశయంలో 6 లక్షల చేప పిల్లలను అధికారులతో కలిసి ఆమె విడుదల చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో మత్స్యకారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి తిరుపతయ్య, మండల తెదేపా అధ్యక్షుడు ఎ.మధుసూదనరావు, ఎం.పురుషోత్తంనాయుడు, ఎ.తవిటినాయుడు, డి.లక్ష్మణరావు పాల్గొన్నారు.


చేప పిల్లలను విడిచిపెడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

శ్యామలాంబ ఉత్సవానికి చాటింపు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు పట్టణంలో శ్యామలాంబ అమ్మవారి పండగ మే నెలలో జరగనుంది. ఈ నేపథ్యంలో సంప్రదాయం ప్రకారం గురువారం యువరాజు విక్రమచంద్ర సన్యాసిరాజు ఇంటి వద్ద దండోరా వేశారు. అనంతరం అల్లువారు, జన్నివారి ఇళ్ల వద్ద, అమ్మవారి గద్దె ప్రాంతంలో చాటింపు చేస్తారు. మే 18, 19, 20వ తేదీల్లో జాతర నిర్వహించనున్నట్లు యువరాజు సన్యాసిరాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఆక్కాన అప్పారావు, తెదేపా నాయకుడు చిట్టి తెలిపారు.


యువరాజు విక్రమచంద్ర ఇంటి ముందు దండోరా

తొలిదశలో రూ.13 కోట్లతో ప్రణాళికలు

వెనుకబడిన తరగతుల కార్పొరేషన్ ద్వారా యువతకు బంగారు భవిష్యత్తు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం ప్రణాళికలు వేసింది. ఈమేరకు రూ.కోట్ల మేర వెచ్చించి.. ఉపాధి అవకాశాలు కల్పించనుంది. అందులో భాగంగా.. బీసీ కార్పొరేషన్‌కు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు సంబంధిత అధికారులు చర్యలు చేపడుతున్నారు. నిరుద్యోగులు.. యూనిట్ల మంజూరు.. ఎక్కువ మందికి ఆధారం.. ఖర్చులు.. తదితర వివరాలు సేకరిస్తున్నారు. ప్రక్రియ పూర్తయితే మరికొన్ని నెలల్లోనే మెరుగైన అవకాశాలు దక్కనున్నాయి.

బీసీ యువతకు 'ఉపాధి' పండుగ

విజయనగరం మయూరికూడలి, న్యూస్‌టుడే

మళ్లీ ఆ వెలుగులు..

ఎన్‌బీసీఎఫ్‌డీసీ ద్వారా కేంద్రం నేరుగా రాష్ట్రంలోని బీసీ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలు ఇస్తోంది. ఇందులో భాగంగా గతంలో మాదిరిగా వివిధ రకాల యూనిట్లు మంజూరు చేయనున్నారు. ఈసారి వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలుగా విభజించి, లబ్ధి చేకూర్చనున్నారు. ఇందులో భాగంగా జిల్లాకు సంబంధించి తొలి దశలో రూ.13 కోట్ల మేర రుణాలు ఇచ్చేందుకు ప్రణాళికలు వేస్తున్నారు. పనిముట్లు, ట్రాక్టర్లు, కార్లు, కుట్టు మిషన్లు, బ్యూటీషియన్ కిట్లు, మామిడితాండ్ర, బుట్టల అల్లికలు తదితర యూనిట్లు మంజూరుకు అవకాశం ఉందని కార్పొరేషన్ ఈడీ పెంటోజీరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఈమేరకు ప్రభుత్వానికి వివరాలు పంపిస్తామని, అధికారిక ఉత్తర్వులు వచ్చాక కార్యాచరణ సిద్ధం చేస్తామని చెప్పారు.

భారీగా లబ్ధి..



తెదేపా అధికారంలో తూర్పు కాపు, కమ్మరి, రజక, నాయీ బ్రాహ్మణ, వాల్మీకి, బోయ తదితర కులాలతో పాటు ఈబీసీ, ఎంబీసీ(సంచార జాతులు), వైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసింది. వివిధ రకాల కులవృత్తుల అవసరం మేర 30 శాతం రాయితీతో రుణాలు అందించేది. స్వయం ఉపాధిలో భాగంగా 30 శాతం, ఆదరణ పథకం కింద కొన్ని యూనిట్లకు 90 శాతం వరకు రాయితీ దక్కేది. అంతే కాకుండా ఎన్‌బీసీఎఫ్ (జాతీయ వెనుకబడిన తరగతుల ఆర్థిక, అభివృద్ధి కార్పొరేషన్) ద్వారా 40 శాతం సబ్సిడీతో వాహనాలు అందించారు. 2014 నుంచి 2019 మార్చి వరకు ఉమ్మడి జిల్లాలో 50,852 మందికి రూ.220.98 కోట్ల రుణం దక్కింది.

అయిదేళ్లూ నిర్వీర్యం..

గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో బీసీ కార్పొరేషన్ ద్వారా పెద్దఎత్తున రుణాలు అందించారు. అర్హులకు పలు రకాల వాహనాలు సమకూర్చారు. వైకాపా వచ్చాక ఆయా పథకాలను ఆపేసింది. కార్పొరేషన్లను శాఖలుగా విభజించింది. నిర్వీర్యం చేసింది. అయిదేళ్లలో స్వయం ఉపాధి కోసం రూపాయి కూడా చెల్లించలేదు. ఒక్కరికి కూడా రుణం దక్కలేదు. శిక్షణలు, వాహనాలు సైతం దూరమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇకనుంచి భారీ ఎత్తున లబ్ధి చేకూర్చేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

హోం మంత్రికి ఘన స్వాగతం


మంత్రితో కొండపల్లి, అదితి, నాగమాధవి, నాగార్జున, లలితకుమారి, ఐవీపీ, రవిశేఖర్, వనజాక్షి, అనురాధా బేగం తదితరులు

విజయనగరం అర్బన్, డెంకాడ, నెల్లిమర్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర హోంశాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత గురువారం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆమె పొలిట్ బ్యూరో సభ్యుడు అశోక్‌గజపతిరాజును బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిశారు. పాదాభివందనం చేసి, శాలువాతో సన్మానించారు. అనంతరం అశోక్, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, లోకం నాగమాధవి, కోళ్ల లలితకుమారి, పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అక్కడి నుంచి గుర్లకు వెళ్లారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిమిడి నాగార్జున, ఐవీపీ.రాజు, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, రాష్ట్రపరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, పార్లమెంటరీ మహిళా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సువ్వాడ వనజాక్షి, అనురాధా బేగం పాల్గొన్నారు. రాజాపులోవ వద్ద మంత్రిని రవిశేఖర్, బంగార్రాజు, ఆనంద్‌కుమార్ గజమాలతో సత్కరించారు.


అశోక్‌కు నమస్కరిస్తూ..

పొగ.. ఆరోగ్యానికి సెగ

పాలకొండ శివారు ప్రాంతాలను పొగ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పట్టణంలో సేకరించిన చెత్తను కొన్నిరోజులుగా స్థానికంగా ఉన్న వెంకటరాయుడు కోనేరు గట్టుపై వేస్తున్నారు. గురువారం ఉదయం నిప్పు పెట్టడంతో దట్టమైన పొగలు వ్యాపించాయి. ఆంజనేయనగర్, నీలమ్మకాలనీ, సాయిరాం కాలనీ, టీచర్ల కాలనీ, రామాకళామందిర్‌వీధి, వేమకోటివారివీధి, యాతవీధి ప్రజలతో పాటు సమీప ప్రాంతీయాసుపత్రి దారిలో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలు అదుపు చేశారు.

– న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం, పాలకొండ



ఓటుహక్కుపై అవగాహన


మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి మోహనరావు, చిత్రంలో డీఆర్వో తదితరులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: శాసనమండలి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ స్థానానికి జరగబోయే ఎన్నికల్లో భాగంగా ఓటుహక్కుపై ఉపాధ్యాయులకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.మోహనరావు ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఉమ్మడి జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. అర్హులైన వారంతా ఓటుహక్కు పొందేలా చూడాలన్నారు. నవంబరు ఆరో తేదీలోగా హక్కు కోసం దరఖాస్తు చేయించాలని చెప్పారు. 23న ముసాయిదా ప్రకటిస్తామని, అభ్యంతరాల స్వీకరణ అనంతరం డిసెంబరు 30న తుది జాబితాను వెల్లడిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాల డీఆర్వోలు ఎస్.డి.అనిత, జి.కేశవనాయుడు, జిల్లా ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు భాస్కరరావు, తహసీల్దార్లు, ఎంఈవోలు, కళాశాలల ప్రధానాచార్యులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.


'చంద్రబాబు ఆస్థానం' పుస్తకావిష్కరణ

విజయనగరం అర్బన్: సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఇతర మంత్రుల రాజకీయ జీవిత విశేషాలపై ప్రముఖ రచయిత సముద్రాల గురుప్రసాద్ రాసిన 'చంద్రబాబు ఆస్థానం' పుస్తకాన్ని అశోక్ బంగ్లాలో ఎమ్మెల్యే అదితి ఆవిష్కరించారు. నాయకులు శివారెడ్డి, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.



పౌరాణిక కళాకారుడి మృతి

బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: శివరాంపురం గ్రామానికి చెందిన రంగస్థల పౌరాణిక కళాకారుడు ఆర్.శ్రీరాములు నాయుడు(92) బుధవారం రాత్రి మృతి చెందారు. శ్రీకృష్ణుడు, రాముడు పాత్రల్లో రాష్ట్రంతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ ప్రదర్శనలిచ్చారు. కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలు అందించారు. సుమారు 200 మంది వృద్ధ కళాకారులకు పింఛన్లు, నిరుపేదలకు ప్రభుత్వం ద్వారా ఇళ్ల స్థలాలు ఇప్పించారు. ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురజాడ విద్యా సంస్థల అధినేత జి.స్వామినాయుడు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.


శ్రీరాములు నాయుడు (పాతచిత్రం)

అప్రమత్తత అవసరం

పార్వతీపురం, పట్టణం: దానా తుపాను నేపథ్యంలో జిల్లాలో ఈదురుగాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టరేట్‌లో మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఎప్పటికప్పుడు కలెక్టరేట్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

డీఆర్వోగా రవీంద్రరావు

పార్వతీపురం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాకు కొత్త డీఆర్వోలు వస్తున్నారు. విజయనగరం డీఆర్వోగా అక్కడి ఉప కలెక్టర్ ఎస్.శ్రీనివాసమూర్తిని ఎస్.డి.అనిత స్థానంలో నియమించారు. మన్యం జిల్లాకు ఎ.రవీంద్రరావు రానున్నారు. ఇప్పటివరకు ఆ స్థానంలో కేశవనాయుడు ఇన్‌ఛార్జిగా ఉండేవారు.



తెల్లకోటు పవిత్రతను కాపాడుతాం

వైద్య వృత్తి ఎంతో గొప్పదని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రధానాచార్యురాలు కె.పద్మలీల పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరంలో చేరిన ఎంబీబీఎస్ విద్యార్థులతో ఆసుపత్రి యాజమాన్యం గురువారం సమావేశమైంది. ఈ సందర్భంగా ఈ రంగం గొప్పదనాన్ని ఆమె వివరించారు. కార్యక్రమంలో భాగంగా వారితో ప్రతిజ్ఞ చేశారు. తెల్లకోటు పవిత్రతను కాపాడుతామని అంతా నినదించారు. డీఎంఈ వ్యవస్థాపకుడు కె.విష్ణు ప్రసాద్, శ్రీకాకుళం కళాశాల ప్రధానాచార్యుడు ఆర్.వెంకటాచలం, మహారాజ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంటు అప్పలనాయుడు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వైద్యవిభాగం

విద్యుదాఘాతంతో ఇంటిపెద్ద దుర్మరణం

మక్కువ: స్తంభం పైకెక్కిన ఓ వ్యక్తి విద్యుదాఘాతం కారణంగా కిందపడి మరణించాడు. ఈ విషాదకర ఘటన మక్కువ మండలంలో చోటుచేసుకుంది. చెముడు గ్రామానికి చెందిన కె.శంకరరావు(49) ప్రైవేటుగా విద్యుత్తు పనులు చేస్తుంటాడు. గురువారం స్థానికంగా ఉన్న ఓ స్తంభం ఎక్కాడు. ఇన్వర్టర్ లైన్ నుంచి విద్యుత్తు సరఫరా కావడంతో కిందపడ్డాడు. అక్కడివారు స్పందించి, ఆసుపత్రికి తరలించేలోపే మరణించాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించామని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు. శంకరరావుకు భార్య పార్వతి, ఇద్దరు పిల్లలున్నారు.


శంకరరావు (పాతచిత్రం)

ప్రాణం తీసిన పాముకాటు

గజపతినగరం: మండలంలోని వేమలికి చెందిన పి.బంగారమ్మ(48) ఈనెల 22న గొర్రెలను మేపేందుకు వెళ్లి పొలంలో పాము కాటుకు గురయ్యారు. కుటుంబ సభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై లక్ష్మణరావు తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

ఉపాధికి వెళ్తే ఊపిరి ఆగింది

గుర్ల, తుని గ్రామీణం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా తుని గ్రామీణ మండలం చేపూరులోని జాతీయ రహదారి కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లా వాసి దుర్మరణం చెందాడు. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. గుర్ల గ్రామానికి చెందిన కె.గురునాయుడు(35) లారీ చోదకుడిగా పనిచేసేవాడు. కోడిగుడ్ల లోడు కోసం ఇటీవల హైదరాబాద్ వెళ్లాడు. తిరిగి వస్తున్న సమయంలో చేపూరు కూడలి వద్ద మలుపు తిరుగుతున్న లారీని ఢీ కొనడంతో క్యాబిన్‌లో చిక్కుకున్నాడు. సమాచారం అందుకున్న ఎన్‌హెచ్ అంబులెన్సు సిబ్బంది కొనఊపిరితో ఉన్న ఆయనను బయటకు తీసి, ఆసుపత్రికి తరలించారు. అయితే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయన వెంట ఉన్న క్లీనరు రాముకు గాయాలయ్యాయి. గురునాయుడుకు భార్య ఆదిలక్ష్మి, కుమారులు గిరి, చరణ్ ఉన్నారు. కుటుంబ పోషణకు ఆయనే దిక్కు. దీంతో కన్నీరుమున్నీరవుతున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని గ్రామీణ ఎస్సై కృష్ణమాచారి తెలిపారు.


గురునాయుడు (పాతచిత్రం)


వ్యానులో ఇరుక్కుపోవడంతో బయటకు తీస్తున్న ఎన్‌హెచ్ సిబ్బంది

నగరంలో మూడు బస్సుల దగ్ధం


కాలిపోయిన వాహనాలు

నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని పాత బస్టాండు సమీపంలోని రాజీవ్ స్టేడియం ఎదురుగా పార్కింగ్‌లో ఉన్న మూడు ప్రైవేటు బస్సులు గురువారం వేకువ జామున దగ్ధమయ్యాయి. విజయలక్ష్మి ట్రావెల్స్ పేరుతో కొన్నిరోజులుగా వీటిని నడుపుతున్నారు. బుధవారం రాత్రి మైదానం ముందుగల రోడ్డుపై పెట్టారు. సమీపంలోనే బార్ అండ్ రెస్టారెంటు ఉంది. వేకువ జామున రెండు వాహనాల నుంచి పొగలు రావడాన్ని చూసి సెక్యూరిటీ గార్డు యజమాని తాతారావుకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చేలోపు రోడ్డుకు అటువైపున్న మరొకటి కూడా దగ్ధమైంది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నామని అగ్నిమాపకాధికారి రామ్‌ప్రకాశ్ తెలిపారు. కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాసరావు చెప్పారు.

యువకుడిపై పోక్సో కేసు

బొబ్బిలి: మన్యం జిల్లాలోని ఓ ఏకలవ్య పాఠశాలలో ఇంటర్ చదువుతున్న బాలిక.. అదే ప్రాంతానికి చెందిన యువకుడు మోహనరావు తనను లైంగికంగా లోబర్చుకున్నట్లు ఫిర్యాదు చేయడంతో గురువారం అతడిపై పోక్సో కేసు నమోదు చేశామని బొబ్బిలి సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. పార్వతీపురం పోలీసులు కేసును బొబ్బిలికి బదిలీ చేయడంతో సమగ్ర దర్యాప్తు నిర్వహించి అరెస్టు చేసి, రిమాండుకు తరలించామని చెప్పారు. బ్రిక్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్న నిందితుడు బాలికను బొబ్బిలికి తీసుకువచ్చి లోబర్చుకున్నట్లు సమాచారం ఉందన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

హోరాహోరీగా అంతర కళాశాలల పోటీలు


పాలకొండలో క్రీడాకారిణుల కబడ్డీ పోటీలు

పాలకొండ, గ్రామీణం, క్రీడావిభాగం, న్యూస్‌టుడే: అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్ కళాశాలల పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. వాలీబాల్ పోటీల్లో పురుషుల విభాగంలో రాజాం జీసీఎస్ఆర్ డిగ్రీ కళాశాల, మహిళల విభాగంలో పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల జట్లు విజేతలుగా నిలిచాయి. కబడ్డీలో మహిళల విభాగంలో సీతంపేట, పాలకొండ విద్యార్థులు తొలి రెండు స్థానాల్లో నిలిచారు. ప్రిన్సిపల్ డా.ఎం.శ్యామ్‌బాబు పర్యవేక్షించారు. ★ స్కూల్‌గేమ్స్ అండర్-14 బాల, బాలికల ఎంపికలు విజయనగరంలోని రాజీవ్ మైదానంలో జరిగాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో 200 మంది వరకు క్రీడాకారులు తరలివచ్చారు.


విజయనగరంలో వాలీబాల్‌లో తలపడుతున్న బాలికలు




సృజనకు వేదిక

పార్వతీపురం పట్టణంలోని భాస్కర ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో గురువారం ఈనాడు ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగం వల్ల కలిగే లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. ఎం.ముబారక్ (పదో తరగతి), జి.హేమంతిసాయి (తొమ్మిదో తరగతి), వై.శివసాయి శ్రీహర్షిత (ఎనిమిదో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ చుక్క భాస్కరరావు, ప్రిన్సిపల్ జి.పురుషోత్తంనాయుడు, ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

మలేరియా నివారణకు చర్యలు

పాచిపెంట, న్యూస్‌టుడే: మండలంలోని గిరిశిఖర గ్రామం మోదుగ గూడెంలో మలేరియా నివారణకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా సహాయ నియంత్రణ అధికారి సూర్యనారాయణ తెలిపారు. గురువారం గ్రామాన్ని సందర్శించారు. ఈ ఏడాది అయిదుగురు మలేరియా బారిన పడ్డారని, ఇక నుంచి అలాంటి పరిస్థితి రాకుండా చూస్తామన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. అనంతరం పలువురి నుంచి రక్త నమూనాలు సేకరించారు. సబ్‌యూనిట్ అధికారి ఈశ్వరరావు, ఆరోగ్య కార్యకర్త వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


రక్త నమూనాలు సేకరిస్తున్న శ్రీనివాసరావు, సిబ్బంది

విజయవంతానికి పిలుపు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడలో ఈ నెల 28న అగ్రిగోల్డ్ బాధితులు తల పెట్టిన మహా విజ్ఞాపన దీక్షను విజయవంతం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తవిటి నాయుడు పిలుపునిచ్చారు. పట్టణంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. అగ్రిగోల్డ్ సమస్యతో రాష్ట్ర వ్యాప్తంగా 60 మంది వరకు మృతి చెందారన్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి మూడు నెలల్లో న్యాయం చేస్తామని చెప్పి మాట తప్పారన్నారు.

సీతానగరం, బలిజిపేట, న్యూస్‌టుడే: సీతానగరం మండలంలోని కాశీపేట శీతలీకరణ కేంద్రం వద్ద పాల ఉత్పత్తిదారుల సదస్సు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.లక్ష్మునాయుడు తెలిపారు. అన్ని గ్రామాల రైతులు సదస్సులో పాల్గొనాలని కోరారు. బలిజిపేటలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు జి.సత్యనారాయణ, జి.బలరామినాయుడు, ఎం.దుర్గారావు మాట్లాడుతూ.. దాణా ధర విపరీతంగా పెరగడంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? పాలకొండ శిథిలావస్థకు వీధి కాలువలో చెత్తతో ఇబ్బందులు పడుతున్నాం. - రవి
☛ కాలువలో వ్యర్థాల తొలగింపు పనులు చేపడతాం. - ఎస్.సర్వేశ్వరరావు, కమిషనరు – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

? బలిజిపేటలోని మెట్టవీధి నుంచి మండల కార్యాలయాల సముదాయానికి వెళ్లే మార్గానికి ఇరువైపులా వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన వస్తోంది. - స్థానికులు
☛ రహదారి పరిశీలించి రెండు రోజుల్లో శుభ్రం చేస్తాం. - పి.అలివేలు, పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, బలిజిపేట

పరిసరాలు శుభ్రం

స్పందనకు వందనం

బలిజిపేట గ్రామీణం: మండలంలోని అరసాడ పీహెచ్‌సీ చుట్టూ పొదలు, పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఇటీవల ఈనాడు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలియజేశారు. వార్త ప్రచురించగా.. వైద్యులు శ్రీధర్, గాయత్రి స్పందించారు. పరిసరాలు శుభ్రం చేయించారు.

ఎండుతున్న గొంతులు.. ఛిద్రమైన దారులు


కాలనీలో దర్శనమిస్తున్న మట్టి రోడ్డు

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురం పట్టణ శివారులోని వైకేఎం కాలనీలో సుమారు 450 కుటుంబాలున్నాయి. పక్కా కాలువలు, సీసీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ కుళాయి నీరు రెండు, మూడు రోజులకు ఒకసారి సరఫరా అవుతుంది. పార్వతీపురం నుంచి ఎమ్మార్‌నగరం వరకు రోడ్డు చిద్రమైంది. నిధులున్నా మూడేళ్లుగా పనులు నిలిచిపోవడంతో గోతులుగా మారింది. ఎమ్మార్‌నగరం, చినబొండపల్లి, వెంకంపేట గ్రామాల్లో తాగు నీటి సమస్యలు పరిష్కారం కావడం లేదు.

అందని సాగునీరు..

జంఝావతి ప్రాజెక్టు నుంచి ఎగువ కాలువ కృష్ణపల్లి మీదుగా జమదాల వరకు 17 కిలోమీటర్ల మేర కాలువలు తవ్వారు. చినబొండపల్లి దిగువన వెంకంపేట చెరువు వరకు నీరు వచ్చేలా పిల్ల కాలువలు ఉన్నా నిర్వహణకు నోచుకోలేదు. దీంతో కాలువ రూపురేఖలు మారిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా సాగు నీరు మాత్రం రావడం లేదు. దీనిపై డీఈఈ శ్రీనుబాబు వద్ద ప్రస్తావించగా. . మధ్యలో రాతిబండ తొలగించాల్సి ఉందన్నారు.

నిలిచిన రహదారులు..

పార్వతీపురం నుంచి ఒడిశాకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి విస్తరణ ఏడాదిగా నిలిచింది. వెంకంపేట కూడలి నుంచి ఎమ్మార్‌నగరం వరకు గుంతలుగా మారింది. పార్వతీపురం నుంచి ఒడిశా సరిహద్దు వరకు 13 కిలోమీటర్ల మేర రూ.17 కోట్లతో మూడేళ్ల క్రితం విస్తరణ పనులు ప్రారంభించారు. ఎమ్మార్‌నగరం తర్వాత నిధులు లేక వదిలేశారు. మండలంలోని 52 గ్రామాలకు నీరు అందించే జమదాల పైలెట్ ప్రాజెక్టు శివారున ఉన్న ఎమ్మార్‌నగరం, వెంకంపేట, చినబొండపల్లి గ్రామాలకు సక్రమంగా నీరు రావడం లేదు. దీంతో ప్రజలు పైపులైన్ల లీకుల వద్ద పడుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బసవరాజు వద్ద ప్రస్తావించగా.. ఇటీవల పూర్తిస్థాయిలో పైపులైన్ల పనులు చేశామని, అందరికీ తాగునీరు ఇస్తామన్నారు.


లీకుల వద్ద నీరు పడుతున్న మహిళలు

శివారు కాలనీల్లో సమస్యల తిష్ఠ

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు పట్టణంలో శివారు ప్రాంతాలైన బంగారమ్మ కాలనీ, అఫీషియల్ కాలనీల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పక్కా రహదారులు, కాలువలు లేకపోవడంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. పారిశుద్ధ్య పనులు సైతం అరకొరగానే జరుగుతున్నాయి. అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. తెలగవీధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో సరైన వైద్యం అందడం లేదని చెబుతున్నారు. మరోవైపు స్థానికంగా ఉన్న ఉద్యానం అధ్వానంగా దర్శనమిస్తోంది. అందులో పెద్దఎత్తున మొక్కలు పెరిగాయి. ఈ కాలనీలో అయిదు నీటి పథకాలు ఉండగా.. మూడు పనిచేయడం లేదు. ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులను పట్టణంలోని గాడివీధి విద్యాలయంలో విలీనం చేయడంతో అక్కడికి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. అందులో ఉన్న ఆర్వో ప్లాంటు మూలకు చేరింది.


బంగారమ్మ కాలనీలో పార్కు దుస్థితి


అఫీషియల్ కాలనీలో వీధి దీపాలు లేని స్తంభాలు

అక్కడా అంతే..

మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర, ప్రస్తుతం మంత్రి సంధ్యారాణి నివాసముంటున్న అఫీషియల్ కాలనీలో ఒకే ఒక్క నీటి పథకం ఉంది. అది కూడా మరమ్మతులకు గురైంది. పురపాలక సంఘం నుంచి పైపులైన్లు వేసినా కుళాయిలు మాత్రం బిగించలేదు. కాలనీలో సగభాగం నెలపర్తి పంచాయతీ రెవెన్యూ గ్రామంలో ఉండగా, వారు కూడా కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. తాగునీటి పథకాల ఏర్పాటే లేదు. చాలా స్తంభాలకు వీధిదీపాలు లేవు. చాలావీధుల్లో మట్టిదారులే దర్శనమిస్తున్నాయి. నిధుల లభ్యత మేరకు పనులు చేపడతామని పురపాలిక డీఈఈ ప్రసాద్ తెలిపారు. పరిశీలించి, వీధిదీపాలు ఏర్పాటు చేస్తామని కార్యదర్శి ప్రేమ్‌కుమార్ చెప్పారు.

ధ్రువపత్రాల జారీలో ఆలస్యంపై ఆరా


ఆర్ఐ, సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: చదువు, భూ వ్యవహారాలకు సంబంధించిన వారికి ధ్రువపత్రాల జారీలో ఆలస్యం ఎందుకు అవుతోందని రెవెన్యూ సిబ్బందిని ఎమ్మెల్యే బి.విజయచంద్ర ప్రశ్నించారు. గురువారం తహసీల్దారు కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ధ్రువపత్రాల కోసం పలుమార్లు తిరగాల్సి వస్తోందని విద్యార్థులు ఫిర్యాదులు చేశారని ఆర్ఐ రామచంద్రరావును నిలదీశారు. వీలైనంత వేగంగా అందజేయాలన్నారు. అనంతరం పార్వతీపురంలో ప్రజాదర్బారు నిర్వహించి 23 మంది నుంచి అర్జీలు స్వీకరించారు.

సభ్యత్వ నమోదుతో మేలు


నాయకులతో సమావేశమైన భూదేవి

సీతంపేట, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదులో పాలకొండ నియోజకవర్గం రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండేలా నాయకులు కృషి చేయాలని పాలకొండ పార్టీ ఇన్‌ఛార్జి పడాల భూదేవి అన్నారు. సీతంపేటలో క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయి నాయకులతో సమావేశమయ్యారు. ఈ నెల 26 నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. రూ.100తో సభ్యత్వం పొందితే కార్యకర్తలకు రూ.5 లక్షల ప్రమాద బీమా, సాధారణ మరణానికి రూ.10 వేలు, విద్య, ఆరోగ్యం, ఉపాధి సహకారం కల్పిస్తారని భూదేవి వివరించారు.

వేతనాలు చెల్లించాలని వినతి


మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న వైద్యులు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యుల సమస్యలను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకువెళ్లినట్లు వైద్యుల సంఘం నాయకులు వినోద్‌కుమార్, రాహుల్, యూనస్, శ్యామ్ తెలిపారు. గురువారం విజయవాడలో మంత్రిని కలిసి వినతి పత్రం ఇచ్చామన్నారు. సమ్మె కాలానికి సంబంధించి నిలిపివేసిన వేతనాలు విడుదల చేయాలని, ఇంక్రిమెంట్లు, టైమ్ బాండ్ పదోన్నతులు, గిరిజన ప్రాంతాల్లో పనిచేసేవారి ఇన్సెంటివ్, కుటుంబ వైద్యుడు కార్యక్రమం భత్యాలపై చర్చించామని వైద్యులు తెలియజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. పి.శ్రావణి, సీహెచ్.గంగరాజు, వి.చంద్రశేఖర్, విద్యాసాగర్, కె.జ్యోత్స్న, ఎ.కావ్య వచ్చే నెల 3, 4వ తేదీల్లో శ్రీకాకుళంలో జరగనున్న టోర్నమెంటులో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరరావు, పీడీ చిన్నారావు తెలిపారు.

ఈ పాపం.. గత పాలకులదే!

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: గత పాలకుల ప్రణాళిక లోపంతో ప్రస్తుతం పాలకొండ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రూ.కోట్లలో నిధులు ఉన్నా సకాలంలో పనులు చేయకపోవడంతో అవస్థలు తప్పడంలేదు. నగర పంచాయతీగా ఉన్న పాలకొండ పట్టణంలో ఇంటింటికీ తాగు నీరు అందించేందుకు కేంద్రం నాన్‌అమృత్ పథకంలో భాగంగా రూ.57 కోట్లు మంజూరు చేసింది. 65 కి.మీ. మేర పైపులైన్లు, 5 కి.మీ. మేర ప్రధాన పైపులైన్లు వేయాలి. కానీ మూడేళ్లలో కేవలం 5.7 కి.మీ. పనులు మాత్రమే జరిగాయి. గారమ్మకాలనీ, మురళీమోహన్‌నగర్, గాయత్రీనగర్, నవోదయనగర్, ఎన్ఎస్ఎన్ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో తాగు నీరు సక్రమంగా అందడం లేదు.

శిలాఫలకంతో సరి..

పాలకొండ పట్టణంతో పాటు మండలంలో కూరగాయల రైతులు అధికంగా ఉన్నారు. వీరు ఉత్పత్తుల విక్రయానికి రైతుబజారు అందుబాటులో లేదు. నాలుగేళ్ల క్రితం స్థానిక నాగవంశంవీధి కూడలి వద్ద శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభించలేదు. వడమ పరిధిలోని కల్యాణి కోనేరును రూ.38 లక్షలు, వెంకటరాయుడు కోనేరును రూ.32 లక్షలతో అభివృద్ధి చేయాలని నిర్ణయించినా పనులు జరగలేదు. కల్యాణి కోనేరు గట్టుపై రక్షణ కంచె ఏర్పాటు చేసి బోర్డు అమర్చారు. వెంకటరాయుడికోనేరులో పూడికలు తీసి వదిలేశారు.


సగంలో ఆగిన ఆరోగ్య కేంద్రం పనులు


అభివృద్ధికి నోచుకోని కోనేరు

అద్దె గదుల్లో ఆరోగ్య కేంద్రం..

పాలకొండ ప్రజలకు ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు అయిదేళ్ల క్రితం రూ.80 లక్షలతో తహసీల్దారు కార్యాలయం ఎదురుగా పట్టణ ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. నేటికీ పూర్తికాలేదు. దీంతో మురళీమోహన్‌నగర్‌లో అద్దె భవనంలో సేవలు అందిస్తున్నారు. ఇరుకు గదుల్లో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆధునిక యంత్ర పరికరాలు మూలకు చేర్చారు. దీనిపై కమిషనర్ సర్వేశ్వరరావు వద్ద ప్రస్తావించగా.. పాలకొండలో సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ముడుపుల పూజలు



సీతానగరం: స్థానిక వేణుగోపాల ఆలయ ప్రాంగణం గురువారం భక్తులతో కిటకిటలాడింది. రుత్వికులు మత్తిరుమల రంగనాథం అయ్యంగారు ఆధ్వర్యంలో భాగవత సప్తాహ యజ్ఞ పూజలు, పారాయణం, విష్ణు సహస్రనామాలు చేపట్టారు. లక్ష్మీనృసింహునికి ముడుపుల పూజలు జరిగాయి.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని బెలగాం, ఐటీడీఏ 11కేవీ ఫీడర్ లైను నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి 12 వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మురళీధర్ తెలిపారు. ◆ పాలకొండ గ్రామీణం: పాలకొండలోని ఎన్‌కేరాజపురం, నాయుడునగర్, సీతంపేట రోడ్డు, నీలమ్మకాలనీ, ప్రాంతీయాసుపత్రి వీధులు, ఎంఎంనగర్, యాతవీధి, వేమకోటివారి వీధి, రామాకళామందిర్ వీధి, శ్రీకాకుళం రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని ఈఈ టీజీకే మూర్తి తెలిపారు. ◆ సాలూరు గ్రామీణం, భామిని: సాలూరు మండలంలోని గంగన్నదొరవలస, భామిని మండలంలోని కొరమ, లివిరి పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ గోపాలరావునాయుడు, ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

సమగ్ర పరిశీలన చేపట్టాలి

వీరఘట్టం, న్యూస్‌టుడే: పొట్టదశలో వరి పంటను సమగ్రంగా పరిశీలించాలని ఏవో జె.సౌజన్య అన్నారు. కంబరలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సస్య రక్షణ చర్యలు, ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. పురుగు, తెగుళ్ల ఆశిస్తే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సమన్వయ కర్త కాంచనమాల, ఐసీఆర్‌పీ ఎం.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

భద్రతా నియమాలు పాటించాలి

కొమరాడ, న్యూస్‌టుడే: వాహన చోదకులు రహదారి భద్రతపై అవగాహన పెంచుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి ఎం.వి.శశికుమార్ సూచించారు. గురువారం కొమరాడ మండలంలోని పలు గ్రామాల్లో ఆర్టీసీ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. రహదారి భద్రత నియమాలపై చోదకులకు వివరించారు. రవాణా సహాయ అధికారులు వరప్రసాద్, సత్యనారాయణ ఉన్నారు.

29న మండల సమావేశం

బలిజిపేట, న్యూస్‌టుడే: బలిజిపేట మండల సమావేశం ఈ నెల 29న ఉదయం 11 గంటలకు ఎంపీపీ నాగమణి అధ్యక్షతన నిర్వహిస్తామని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అభివృద్ధి నివేదికలతో అధికారులు హాజరుకావాలని ఆమె సూచించారు.

పోక్సో కేసు నమోదు

కొమరాడ: మండలంలోని ఓ గ్రామంలో మైనరు బాలికను వివాహం చేసుకుంటానని యువకుడు ఇంటికి తీసుకెళ్లాడు. అనంతరం దాడికి పాల్పడటంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

మక్కువ, న్యూస్‌టుడే: ఒడిశా రాష్ట్రానికి చెందిన కె.నరేష్ ద్విచక్ర వాహనంపై 20 లీటర్ల నాటుసారా తరలిస్తుండగా మక్కువలోని సువర్ణముఖి నది సమీపంలో పట్టుకున్నట్లు హెచ్‌సీ పైడయ్య తెలిపారు. కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచామన్నారు.

రహదారులు బాగు చేయాలి

సీతంపేట: నియోజకవర్గంలో నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన రహదారి పనులు పూర్తి కాలేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు, మండల కార్యదర్శి ఎ.భాస్కరరావు అన్నారు. కోసంగి, పాలమానుగూడ, హస్సేనుపురం, వీరఘట్టం, కుడ్డపల్లి, ఎగువదారబ, పూతికవలస, అంటికొండ, ఈతమానుగూడ, ముత్యాలు రహదారులపై అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.


ఆహారం పరిశీలిస్తున్న బృంద సభ్యులు

అంగన్‌వాడీల్లో తనిఖీ

పాచిపెంట, న్యూస్‌టుడే: మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల సేవలపై టాటాట్రస్టు ప్రతినిధి వీరభద్రుడు, ఇతర బృంద సభ్యులు తనిఖీ చేశారు. గురువారం పనుకువలస, కోస్టువలస కేంద్రాలను సందర్శించి లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించారు. పౌష్టికాహారాన్ని పరిశీలించారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

పార్వతీపురం గ్రామీణం, పట్టణం, న్యూస్‌టుడే: ఆటోలు, వ్యాన్‌లలో వచ్చే వారు రహదారి భద్రత నిబంధనలు పాటించాలని ఏఎంవీఐ సత్యనారాయణ సూచించారు. గురువారం పట్టణ శివారులో తనిఖీలు చేపట్టారు. అధిక లోడుతో ఉన్న వాహనాలను పరీక్షించి అవగాహన కల్పించారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆర్టీసీ ఉప పర్యవేక్షకుడు బి.జి.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

మక్కువ, న్యూస్‌టుడే: ప్రజల ఆరోగ్య సమస్యలను సత్వరమే గుర్తించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు ఆదేశించారు. గురువారం మక్కువ మండలంలోని కాశీపట్నం కస్తూర్బా విద్యాలయం, మక్కువ పీహెచ్‌సీని సందర్శించారు. గ్రామాల్లో జ్వరాలు, డయేరియా, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించి వెంటనే వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. స్థానిక వసతిగృహంలో ఉన్న విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వైద్యురాలు ఎం.నిఖిల, ప్రిన్సిపల్ నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న జగన్మోహనరావు

నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రతిజ్ఞ చేస్తున్న సభ్యులు

సీతానగరం, న్యూస్‌టుడే: యూటీఎఫ్ సీతానగరం మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పరిశీలకుడు ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం ఎన్నికలు జరిగాయి. గౌరవాధ్యక్షుడిగా టి.మధుసూదనరావు, అధ్యక్ష, కార్యదర్శులుగా పి.శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు, ఉపాధ్యక్షులుగా ఎ.పోలినాయుడు, కె.లక్ష్మి, కోశాధికారిగా డి.వి.రమణను ఎన్నుకున్నారు. వారితో పరిశీలకుడు భాస్కరరావు ప్రతిజ్ఞ చేయించారు.

అభినందనలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: నర్సుల సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులుగా జి.వి.చంద్రసాయి ఎన్నికయ్యారు. విజయనగరంలో నెల రోజులుగా కొనసాగిన ఎన్నికల ప్రక్రియ బుధవారం ముగిసింది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో పనిచేస్తున్న చంద్రసాయి ఎన్నికవడంతో సూపరింటెండెంటు వాగ్దేవి, ఆర్ఎంవో శ్యామల, ఎన్జీవో నాయకుడు కిశోర్, హెడ్, స్టాఫ్ నర్సులు అభినందించారు.


చంద్రసాయిని సత్కరిస్తున్న వాగ్దేవి, అధికారులు

పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీవరం

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: విద్యార్థుల నడవడికపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీవరం అన్నారు. గురువారం కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. క్రమం తప్పకుండా పిల్లలను కళాశాలకు పంపించాలన్నారు. వారు తరగతులకు హాజరు అవుతున్నదీ, లేనిదీ పరిశీలించాలన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి విద్యార్థులు సక్రమంగా చదువుకోవాలని సూచించారు.

బోద బాధితులకు అవగాహన

బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పెదపెంకిలో అతిసారం బాధితులకు వ్యక్తిగత శుభ్రతపై బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి అవగాహన కల్పించారు. గ్రామంలో ఫైలేరియా లేకుండా చేస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించిన నేపథ్యంలో అధికారులు దృష్టి సారించారు. రోగుల వద్దకు వెళ్లి గాయాలను శుభ్రం చేసుకోవడంపై వివరించారు. మురుగు కాలువల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు.


శుభ్రత గురించి వివరిస్తున్న వైద్యాధికారిణి క్రాంతికిరణ్మయి

రూ.1.41 లక్షల ఆస్తి పన్ను చెల్లింపు

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పట్టణంలోని సెయింట్ పీటర్స్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల యాజమాన్యం రూ.1,41,737 ఆస్తిపన్ను ఒకేసారి చెల్లించింది. గురువారం కమిషనరు జి.శ్రీనివాసరాజుకు మొత్తాన్ని అందజేశారు. పుర ప్రజలు, వ్యాపారులు, విద్యా సంస్థలు పన్నులు సకాలంలో చెల్లించి పురపాలక అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు. ఆర్ఐ జి.వినయ్ కుమార్, యాజమాన్య సభ్యులను అభినందించారు.

చిన్నారులతో పనిచేయిస్తే కేసులు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: బాల కార్మికులతో పనులు చేయిస్తే కేసులు పెడతామని పాలకొండ కార్మికశాఖ సహాయాధికారి ఆర్.వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. గురువారం పాలకొండ పట్టణంలోని వివిధ దుకాణాలు, హోటళ్లను పరిశీలించి యజమానులకు సూచనలు చేశారు. ఆయన వెంట సిబ్బంది పి.శ్రీధర్, క్రాంతి, ప్రవీణ్, శ్రీధర్ పాల్గొన్నారు.